

టిటిడి కాంట్రాక్టు కార్మికుల ...
మెరుపు సమ్మె

- 2 వేల మంది విధులకు గైర్హాజరై నిరసన
- టైం స్కేలు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్
- టిటిడి కార్పొరేషన్‌లో విలీనం చేయకుండా డ్రామాలొద్దు
- పెంచకుంటే సరి..జీతాలు కుదిస్తే ఎలా? అంటూ ఆందోళన
- నిరవధిక సమ్మెను కొనసాగిస్తామంటూ ప్రకటన
- కార్మికులకు మద్దతు తెలిపిన సిఐటియు నేతలు


సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి- తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు మెరుపు సమ్మెకు దిగి టిటిడి యాజమాన్యానికి షాక్ ఇచ్చారు. 'అయిన వారికి ఆకుల్లో.. కానివారికి కంచాల్లో' అన్న చందంగా వ్యవహరిస్తూ కొందరిని పర్మినెంటు చేసి, మరి కొందరికి దర్శనం, లడ్డూ కార్డులు ఇచ్చి మాకేమో ప్రస్తుతం ఇస్తున్న జీతాన్ని రూ.11 వేల నుంచి 8 వేలకు కుదిరిస్తారా..? అంటూ 2వేల మంది కార్మికులు ఆదివారం విధులకు గైర్హాజరై తిరుపతిలో నిరసన చేపట్టారు. మున్సిపల్ పార్కు సమీపంలో బైఠాయించి తమకు టైంస్కేలు, గుర్తింపు కార్డులు, లడ్డూ కార్డులు, శ్రీవారి దర్శన సౌకర్యం, స్విమ్స్‌లో ఉచిత వైద్య సేవల్ని ఇచ్చేవరకూ తాము విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. టిటిడి కార్పొరేషన్‌లో విలీనం చేస్తామంటూ తమను మభ్యపెట్టి మోసం చేసిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నుంచి తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకూ సమ్మెను కొనసాగిస్తాంటూ టిటిడి ఆరోగ్యశాఖ అధికారికి కార్మికులు నోటీసులనూ అందించారు. దీంతో అధికారులు సర్దిచెప్పేందుకు సకలవిధాలా ప్రయత్నిస్తున్నప్పటికీ కార్మికులు మాత్రం వెనుకంజ వేయకపోవడం గమనార్హం. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, టిటిడి కాంట్రాక్టు కార్మికసంఘం అధ్యక్షులు టి.సుబ్రమణ్యం, శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్.లక్ష్మి, సిఐటియు నగర కార్యదర్శి వేణు, నాయకురాలు బుజ్జి ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులు చిరంజీవి, రాజా, యుగంధర్, ఎన్‌డి శ్రీను, చంద్రశేఖర్‌రెడ్డిలు కార్మికులకు మద్దతు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి, సుప్రీం కోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని టిటిడి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానంలో 18 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో దశాబ్దాల తరబడి పనిచేస్తున్నారు. అదే పనిచేస్తున్న పర్మినెంటు ఉద్యోగులకేమో దాదాపు 70వేల నుంచి లక్ష రూపాయల వరకు ఇస్తున్నారు. కార్మికులకు మాత్రం కేవలం 11వేలు ఇస్తూ, వారాంతపు సెలవులు గానీ, పిఎఫ్, ఇఎస్ఐ, గుర్తింపు కార్డులు, శ్రీవారి దర్శనం, లడ్డూలు, వైద్యసేవలు లాంటి ఎలాంటి సౌకర్యాలనూ అమలు చేయడం లేదు. అధికారంలోకి రాకముందు జగన్ తిరుపతి పర్యటనకు వచ్చిన సందర్భంలో తాను ముఖ్యమంత్రి అయిన మూడునెలల్లో టిటిడి కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంటు చేయిస్తానంటూ హామీ ఇచ్చారు. అయితే సిఎం కుర్చీలో కూర్చుని దాదాపు మూడున్నరేళు గడుస్తున్నా నేటికీ కార్మికులకు ఇచ్చిన హామీని మాత్రం నెరవేర్చలేదు. పైగా టిటిడి అటవీ విభాగంలో 480 మంది కార్మికులు పనిచేస్తుండగా వారిలో 180 మందిని మాత్రమే ఇటీవల రెగ్యులరైజ్ చేశారు. అలాగే కళ్యాణ కట్టలోని కొందరిని క్షురకులకు మాత్రమే పర్మినెంటు చేశారు. అయితే దాదాపు మూడు దశాబ్దాలుగా వేంకటేశ్వర స్వామినే నమ్ముకుని పనిచేస్తున్న మిగిలిన కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించకపోగా వారికిస్తున్న వేతనాల్లోనూ కోతవిధించారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు. తాజా టిటిడి పారిశుధ్య విభాగంలోని దాదాపు 3,600మంది సులభ్ కార్మికుల జీతాలను రూ.11వేల నుంచి 8వేలకు కుదించినట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహించిన కార్మికులు ఆదివారం మధ్యాహ్నం నుంచి సమ్మెకు దిగడం గమనార్హం.

కార్మికులపై ఇంత అధర్మమా..?
జి.బాలసుబ్రమణ్యం, సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు



నిత్యం ధర్మాన్ని వల్లించే టిటిడి అధికారులు కార్మికుల పట్ల ఇంత అధర్మంగా వ్యవహరించడం దారుణం. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సాక్షాత్తూ దేశసర్వోన్నత న్యాయస్థానమే ఆదేశించినా టిటిడిలో దాన్ని అమలు చేయకపోవడం సిగ్గు చేటు కాదా?... జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వెంటనే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి. వెంటనే లడ్డూ, దర్శనం కార్డులతో పాటు ఉచిత వైద్యం, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలి. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ వారికి అండగా సిఐటియు నిలుస్తుంది.

కార్మికులకు న్యాయం చేయాల్సిందే..!
ఆర్.లక్ష్మి, శ్రామిక మహిళా నేత, తిరుపతి



కాంట్రాక్టు కార్మికులకు టిటిడి న్యాయం చేయాల్సిందే. లేకుంటే ఉధృత పోరాటం తప్పదు. టిటిడి కార్పొరేషన్‌లో విలీనం చేస్తామంటూ కార్మికులను మభ్యపెడతూ వారి చేత గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నారు. పైగా ప్రస్తుతమిస్తున్న వేతనాల్లోనూ కోత విధిస్తే వారెలా బతకాలి. టిటిడి కాంట్రాక్టు విభాగంలో 80శాతం మహిళలే ఉన్నారు. వారికి అవసరమైన కనీస సౌకర్యాలనూ కల్పించకుండా టిటిడి యాజమాన్యం అమానవీయంగా వ్యవహరిస్తోంది. కార్మికులు కన్నెర్ర చేయకముందే వారికి న్యాయం చేయాలి. లేకుండా తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

ఇంటర్వ్యూ

సద్వినియోగం చేసుకుందాం
మధుబాల, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రంథాయాలు విజ్ఞాన భాండాగారాలు వీటిని సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందిచుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ మధుబాల సూచించారు. నేటి ఆధునీక ప్రపంచంలో విద్యార్థులు, యువత ఎక్కువగా సెల్‌ఫోన్లకుతోనే కాలం గడుపుతున్నారు. సెల్‌ఫోన్లులో ఎక్కువ సేపు గడపడం ప్రమాదమని వైద్యులు సూచిస్తున్నా మానడం లేదు. సెల్‌ఫోన్లతో ఎక్కువసేపు గడపకుండా సమీపంలోని గ్రంథాలయాల్లో విజ్ఞాన్ని పెంచే పుస్తకాలను చదువడం మంచిది. ప్రస్తుతం అన్ని గ్రంథాయాల్లో ఇంటర్‌నెట్ అందుబాటులోకి తీసుకువడం జరిగింది. అలాగే మంచి మంచి పుస్తకాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చాము. అలాగే వేసవి సెలవులు ఒంటిపూట బదుల సందర్భంగా జిల్లా గ్రంథాలయం నేతృత్వంలో వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించాం. విద్యార్థులకు ఉచితంగా నృత్యం, చిత్రలేఖనం, భరతనాట్యం, సైన్సు ప్రయోగాలు నేర్పించడం జరిగింది. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశాం. ఆధునీకరించిన గ్రంథాలయాల్లో అనేక కొత్త పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచాం విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ మధుబాల తెలియజేశారు. జిల్లాలోని గ్రంథాలయలపై ప్రజాశక్తికి ఇచ్చినప్రత్యేక ఇంటర్వ్యూలో అనేక విషయాలు తెలియజేస్తూ...

ప్రజాశక్తి : జిల్లాలోని గ్రంథాలయ పరిస్థితి ఏమిటి..?

చైర్‌పర్సన్: గ్రంథాలయలకు పూర్వవైభవనం తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుటోంది. గత ప్రభుత్వం గ్రంథాలయ నిర్వహణ గాలికి వదిలేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలు అనేకం శిధిలావస్థకు చేరుకున్నాయి. దాదాపు 10సంవత్సరాలుగా గ్రంథాలయాలకు పుస్తకాల కొనుగోలు నిధులు మంజురు చేయకపోవడంతో పాతపుస్తకాలతోనే నెట్టుకొస్తున్నారు. అలాగే గ్రంథాలయాల బ్యాక్‌ల్యాగ్ పోస్టులు భర్తీకి నోచుకొకపోవడం వంటి కారణాలతో గ్రంథాలయాలు నామమాత్రంగా మారిపోయాయి. పాఠకుల సంఖ్యతగ్గింది. ఒక్కొ ఉద్యోగి రెండు, మూడు గ్రంథాలయలకు ఇన్‌ఛార్జిలుగా పనిచేయాల్సి వస్తోంది. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు గ్రంథాలయ చైర్‌పర్సన్ మధుబాల తెలిపారు.

ప్రజాశక్తి : స్థానిక సంస్థల నుండీ గ్రంథాలయ పన్ను వసూలు ఎలా ఉంది...?

చైర్‌పర్సన్: గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రజల నుంచి వసూలు చేస్తున్న 8శాతం సెస్ నిధులు గ్రంథాలయ నిర్వహణ కోసం ఇవ్వకపోవడంతో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. పెండింగ్ సెస్ వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. కొన్ని పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి గ్రంథాలయ పన్నులు గ్రంథాలయ సంస్థకు చేరడం లేదు. గ్రంథాలయ సంస్థలకు చేరాల్సిన పన్నులు సంస్థకు చేరినప్పుడే గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడతాయి.

ప్రజాశక్తి : డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు ఎంత వరకు వచ్చింది..?

చైర్‌పర్సన్: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రంథాలయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 4,530 డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు కోసం రూ.150కోట్లు కేటాయిస్తున్నట్లు జిల్లాలో 30కి పైగా డిజిటల్ లైబ్రరీలు రానున్నాయి.

ప్రజాశక్తి: బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, పుస్తకాల కొనుగోలు తీసుకుంటున్న చర్యలేమిటి..?

చైర్‌పర్సన్: జిల్లాలో 20బ్యాక్‌లాగ్ పోస్టులను మే మాసం చివరి నాటికి భర్తీ చేసే అవకాశం ఉంది. కొత్త పుస్తకాల కొనుగోలు కోసం నిధులు మంజురు కావడం జరిగింది. ఇప్పటికే జిల్లాలోని గ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాల జాబితా తయారు చేయడం జరుగుతోంది. వచ్చే మూడు నెలల్లో గ్రంథాలయలకు పూర్వ వైభవం రానుంది.

ప్రజాశక్తి : జిల్లా కేంద్రంలో సొంత భవన నిర్మాణం ఎప్పుడు...?

చైర్‌పర్సన్: జిల్లా కేంద్రంలోని సిఆర్‌రెడ్డి జిల్లా గ్రంథాలయం పేరిట 1988లో ప్రారంభించబడింది. చిత్తూరు నగరానికి నడిఒడ్డులో ఉండటంతో పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. రోడ్డు విస్తరణలో భాగంగా కొంత భాగం కొల్పొవడం జరిగింది. ప్రస్తుతం లక్ష్మీనగర్ కాలనీలో అద్దెభవనంలో నిర్వహిస్తున్నాం. జిల్లా గ్రంథాలయం ఆధునీకరణ కోసం నిధులు మంజురు కానున్నాయి. త్వరలో జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంతో పాటు జిల్లాలోని గ్రంథాలయాను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాము.


మధుబాల, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన రైతు మేఘనాథం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందిన సంఘటన ఆదివారం చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం ఎం.బోయపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి అదే గ్రామానికి చెందిన రైతు నాగభూషణం తన పొలంలోని కంచెకు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం మేఘనాథం(39) అనే రైతు తన పాడిఆవు కనిపించకుండా పోవడంతో ఆవును వెతుకుంటూ రాత్రి సమయంలో పొలం వద్ద వెళ్లాడు. చీకటిల్లో పందులకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మరణించాడు. ఉదయాన్నే అటుగా వెళ్లిన గ్రామస్తులు కొందరు గుర్తించి గ్రామస్తులకు, తవణంపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేసుకుని కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతునికి భార్య ఉంది. పిల్లలు లేరు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (24.04.2023) ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్‌సెంటర్ నెంబర్ 08572- 232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

మన చిత్తూరు అభివృద్ధి వేదిక ఏర్పాటు

కన్వీనర్‌గా పి.చైతన్య ఏకగ్రీవం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాకేంద్రం చిత్తూరు అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, 112 సంవత్సరాల చరిత్ర కలిగిన జిల్లా కేంద్రం చిత్తూరును అభివద్ధి చేయడానికి పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తగినంత శ్రద్ధ పెట్టకపోవడం చిత్తూరు ప్రజలు ఆందోళన చెందుతున్నారని రాజకీయాలను పక్కన పెట్టి అభివద్ధికి అవసరమైన నిధులు కోసం ప్రజాప్రతినిధులు ఉమ్మడి కషిని చేపట్టాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. చిత్తూరు నగర అభివృద్ధి కోసం ఆదివారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఏర్పాటు చేసిన నగరంలోని ప్రజాసంఘాలు, అభుదయవాదులు, మేధావుల సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆదివారం స్థానిక ఎన్‌జీవో హోంలో కుమారవర్మ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్, చిత్తూరు పట్టణ ఆడిటర్స్ అసోసియేషన్, సంతపేట అభివద్ధి కమిటీ, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ, చిత్తూరు నగరాభివద్ధి కమిటీ, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్, రిటైర్డ్ బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్, నివాసప్రాంతాల సంక్షేమ కమిటీ, న్యాయవాదుల సంఘం, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ, సీఐటీయూ, ఐఎఫ్‌టియూ నాయకులు రాంబాబు, అజంతుల్లా, శ్రీనివాసమూర్తి, కార్పొరేటర్ అశోక్, కెఎన్.మురళి, కుమారేశ్, సురేంద్రనాథ్, గిడ్డు బాయి, చైతన్య, కాంజీవరం సురేంద్రన్‌లు పాల్గొని మాట్లాడారు. చిత్తూరు ప్రధాన సమస్యలు చర్చించి 'మన చిత్తూరు అభివద్ధి వేదిక' పేరుతో వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో తీర్మానాలు చేశారు. వేదిక కన్వీనర్‌గా పి.చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరులోని వివిధ ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మానవహక్కుల సంఘాలు, ఉద్యోగకార్మిక సంఘాలు, నివాసప్రాంత సంఘాలన్నీ కలసి ఉమ్మడి కార్యచరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. మన చిత్తూరు అభివృద్ధి వేదిక సమావేశంలో చిత్తూరు నగర అభివృద్ధి కోసం 50 డివిజన్లలో నీటి పైపులు లీకేజీని మున్సిపల్ అధికారులు వెంటనే చేపట్టాలి, కుక్కకాటుకు ప్రజలు గురికాకుండా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలి, దోమల నివారణకు అన్ని డివిజన్లలోని కాలనీల్లో పాగింగ్ చేయాలి, దోమలు వ్యాప్తి చెందకుండా మురికి కాలువలను ప్రతు రోజు శుభ్రం చేయాలి. అవసరమైన పారిశుధ్య సిబ్బందిని నియమించాలి. అలాగే అన్ని చోట్ల వీధిదీపాలు పనిచేసేటట్టు చూడాలి. లెనిన్‌నగర్‌లోని డంపింగ్ యార్డును నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలి, విద్యుత్ స్మశాన వాటిక ను మునిసిపల్ అధికారులు ఏర్పాటు చేయాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించాలి, ఎన్‌టిఆర్ జలాశయంలోని నీరు వధా కాకుండా లీకేజీని అరికట్టాలి. చెత్తా,చెదారం లేకుండా శుభ్రం చేయాలి, ఎన్‌టిఆర్ జలాశయంలో బోట్‌క్లబ్ ను ఏర్పాటు చేసి పిక్నిక్ సెంటర్‌గా మార్చాలి, చిత్తూరులో ప్రభుత్వభూమిలో ప్రతిపాదిత నైపుణ్య యూనివర్సిటీని, మినరల్ యూనివర్సిటీ ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి, సహకార చక్కెర ప్యాక్టరీని ప్రయివేటు చేయకుండా రైతుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి, విజయా డెయిరీ జిల్లా రైతుల సహకార డెయిరీగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలి. అలాగే చిత్తూరు తాగునీరు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీల ప్రకారం తెలుగు గంగ నుండి, అడవిపల్లి రిజర్వాయర్ నుండి నీటిని తీసుకొని రావాలి. మునిసిపల్ కార్పొరేషన్ నోటిపై చేసిన మురికివాడలకు నిధులు కేటాయించి అన్ని విధాలుగా అభివద్ధి చేయాలి. జిల్లా కేంద్రం చిత్తూరు అభివద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను ప్రకటించాలి. చిత్తూరులో గాలి,నీరు వాతావరణ కాలుష్యం నివారించేందుకు చర్యలు చేపట్టాలి. చిత్తూరును గ్రీన్‌సిటీగా అభివద్ధి చేయాలి, చిత్తూరు అపోలో ఆసుపత్రిలో అన్నిరకాల జబ్బులకు సేవలు అందించాలి ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. ప్రతి చిన్న జబ్బులకు బయట ఆసుపత్రికి రెపర్ చేయడం మానుకోవాలి. రోగులకు అవసరమైన మందులు డాక్టర్లు అందుబాటులో ఉండాలి, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశాలు జరపాలి తీర్మానించింది.


చిత్తూరు అభివృద్ధి వేదిక సమావేశంలో పాల్గొన్న వ్యక్తులు

సుపరిపాలనకు పంచాయతీ రాజ్ వ్యవస్థ



ప్రజాశక్తి- పెద్దపంజాణి: ప్రాచీనకాలంలో గ్రామపాలనా వ్యవస్థ ఆనాటి సాంఘిక పరిస్థితులకు అనుగుణంగా ఐదు ప్రధానవత్తులు చేస్తున్న ప్రతినిధులు స్థానిక సాంఘీక పాలకులుగా గుర్తింపు పొందగా, మధ్యయుగంలో ఆదిపత్యపోరుతో ప్రధాన వత్తులు చేస్తున్న స్థానిక పాలకులు అణచివేతకు గురయ్యారు. బ్రిటిష్‌పాలన ప్రారంభంలో ఐదు వత్తుల పాలకులు అంతగా ఆధరణకు నోచుకోకపోవడం వలన స్థానిక సంఘీక పాలన కనుమైరుగైయింది. బ్రిటీష్ గవర్నర్ జనరల్ లార్డు రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు మళ్ళీ పునరుజ్జీవనం పొందాయి.1919- 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంతమేరకు స్థానిక సంస్థలకు బలం చేకూర్చాయి. భారతదేశం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన తర్వాత డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలులోకు రావడం, భారతదేశం గణతంత్ర దేశంగా ఆవిర్భవించడం జరిగింది. ప్రజాసంక్షేమం కోసం పాలకులు రాజ్యాంగాన్ని అనేకసార్లు సవరణ చేశారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ చరిత్రకెక్కగా, 1959 నవంబరు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే రెండవదిగా, మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్‌లో ప్రారంభమైంది. గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకుస్థాయిలో పంచాయతీ సమితి, జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు.

73వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో నూతన పంచాయతీ రాజ్ చట్టాన్ని చేసింది. కేంద్రంలో, రాష్ట్రంలో గ్రామీణాభివద్ధి, పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. 2010 నుంచి ఏప్రిల్ 24ను జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఇంచుమించు 30 లక్షల మంది ప్రజాప్రతినిధులతో నడుస్తున్న మన 'పంచాయతీరాజ్ వ్యవస్థ' ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ. ప్రధానంగా మన గ్రామాలకు ఇది వెన్నెముకగా పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా 718 జిల్లా పంచాయతీలు, 6,097 మండల పంచాయితీలు, 2,34,676 గ్రామ పంచాయితీలు పనిచేస్తున్నాయి. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని 1993 ఏప్రిల్ 24 నుంచి అమలులోకి వచ్చిన 1992 రాజ్యాంగ (73వ సవరణ) చట్టం, గుర్తుగా నిర్వహిస్తారు. స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ, పంచాయతీరాజ్ వ్యవస్థ అని కూడా అంటారు. గ్రామరాజ్యం ద్వారా రామరాజ్యం ఏర్పాటు చేయాలని గాంధీజీ కలలు కన్నారు.ఆయన దష్టిలో ప్రతి గ్రామపంచాయతీ ఒకచిన్న గణతంత్ర రాజ్యం. దేశాభివద్ధికి మూలం గ్రామాభివద్ధే. అందువల్ల గ్రామాభ్యుదయానికి గ్రామపంచాయతీల ఏర్పాటు, వాటికి విస్తత అధికారాలు ఇవ్వడానికి రాజ్యాంగం ప్రాధాన్యం ఇచ్చింది. పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామాల అభివద్ధికి ఆ గ్రామప్రజలే పాటుపడటానికి వీలు కల్పించారు. కేంద్ర గ్రామీణాభివద్ధి, పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ రాష్ట్రాల మంత్రిత్వశాఖలతో దీనికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతుంది.

పంచాయతీరాజ్ వ్యవస్థ ఎందుకు..?

వనరుల పంపిణీలను మెరుగుపరచడానికి, ప్రభుత్వ పనుల్లో స్థానికులు పాల్గొనేలా చేయడానికి, గ్రామీణ ప్రజల దైనందిన అవసరాలను మేలైన పద్ధతిలో తీర్చడానికి, స్థానికంగా అధికంగా ఉద్యోగాలు కల్పించడానికి, పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేయడానికి, పంచాయతీలకు వాస్తవమైన అధికారాలను అందిస్తే స్వావలంబన, స్వీయ చొరవను, సహకారాన్ని పెంపొందించి గ్రామీణ సమాజ రూపురేఖలను మార్చడానికి దోహదం చేస్తాయి. ప్రజలు పాల్గొనే ప్రజాస్వామ్యానికి రూపకల్పన చేస్తాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థ వల్ల ప్రతిచిన్న పనికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడటం జరగదు. కేంద్ర, రాష్ట్ర పాలనా యంత్రాంగంపై అధిక పనిభారాన్ని, ఒత్తిడిని తగ్గించడం. ఆలస్యాన్ని నివారించి ప్రజల సమస్యలపై ప్రభుత్వం త్వరగా స్పందించేలా చేయడం. సేవల పరిమాణాలను పెంచడం, వికేంద్రీకరణ పంచాయతీరాజ్ ధ్యేయాలు.

గ్రామ సచివాలయం ఏర్పాటుతో ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారాలకు దూరంగా ఉన్న అనేక కులాల, మతాల వారున్నారు. పంచాయతీరాజ్ చట్టం అమలుతో అదికారి వికేంద్రీకరణ జరిగి అనేక మంది స్థానిక సంస్థలలో ప్రజా ప్రతినిధులు అయ్యారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక పంచాయతీరాజ్ వ్యవస్థ అని గుర్తింపు పొందినా, గ్రామీణ ప్రాంతాలలో ప్రజల అవసరాలు తీరడానికి, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు అవడానికి, ప్రజాసంతప్తికర స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయం వ్యవస్థను తీసుకువచ్చారు. సుమారు 545 సేవలు నేరుగా వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర కెక్కగా, సంక్షేమ కార్యక్రమాల అమలులో కూడా రాష్ట్రం దేశంలో అగ్రగామిగా నిలిచింది. రాష్ట్ర బడ్జెట్లో అత్యధికశాతం సంక్షేమానికి ఖర్చు చేస్తున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రశంసలు అందుకుంటున్నా ఆ సంక్షేమ పథకాలు అమలు మాత్రం గ్రామసచివాలయం వ్యవస్థ ద్వారానే జరుగుతున్నాయి. ఒక విధంగా 2019 సంవత్సరం తర్వాత రాష్ట్రంలో సంక్షేమ విప్లవం మొదలై నవరత్నాలు ద్వారా లక్షలాది మందికి వైయస్సార్ రైతు భరోసా, నేతన్న నేస్తం, వాహనమిత్ర, ఆసర, చేదోడు, కాపునేస్తం, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాల అమలుకు పంచాయతీ రాజ్‌వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో సుమారు కోటి 50లక్షల కుటుంబాలకు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లకు పారధర్శకంగా అందుతున్నాయంటే రాజ్యాంగం ద్వారా పటిష్టంగా రూపొందించిన పంచాయతీ రాజ్‌వ్యవస్థ గొప్పతనంగా భావించవచ్చు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీడీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు.

'న్యాయశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సామరస్య పరిష్కారానికి కషిచేస్తామని జిల్లా జుడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్, జనరల్ సెక్రటరీ బాలసుబ్రమణ్యం ఆచారి తెలిపారు. ఆదివారం జిల్లా పాతకోర్టు ఆవరణలో డిస్ట్రిక్ట్ జ్యుడీషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈసమావేశానికి స్టేట్ అబ్జర్వేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి కష్ణారావు హాజరైనారు. ఈసందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ఎలాంటి ఉద్యోగాలను భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయశాఖ ఉద్యోగుల పలు సమస్యలను సామరస్యంగా పరిష్కరించడానికి హైకోర్టు న్యాయమూర్తులు ఉన్నత న్యాయమూర్తులను కూడా కలిసి విన్నవించడం జరుగుతుందన్నారు. త్వరలోనే అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని దీనికి సంబంధించి పలు అంశాలను చర్చించామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీపతి ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి బాలసుందర్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపినాథ్

పుస్తకాలకు మించిన మిత్రులు లేరు



ప్రజాశక్తి-పలమనేరు: ఒక మంచి పుస్తకం వందమంది మిత్రులతో సమానమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు అన్నారు. ఆదివారం ప్రపంచ పుస్తకదినోత్స వాన్ని పురస్కరించుకొని కళామందిరంలో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో తులసినాథం నాయుడు మాట్లాడుతూ తలదించుకుని పుస్తకాలు చదవడం అలవాటయితే జీవితంలో తలెత్తుకుని బ్రతికేలా తయారు అవుతామన్నారు. చిరిగిన చొక్కానయినా తొడుక్కో, ఒక మంచి పుస్తకం కొనుక్కో! అన్న మాటలను గుర్తుంచు కొని కొత్త పుస్తకాలు కొని చదవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 200 పుస్తకాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో గంగవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరుశురాం, జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి, శివశంకర్, సంస్థ కార్యదర్శి పుష్ప పాల్గొన్నారు.

పలుచోట్ల వడగండ్ల వాన

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం వద్ద ఆదివారం వడగండ్ల వాన కురిసింది. రెండు గంటలు ఈదురు గాలితో కూడిన భారీ వర్షం కురవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్లో కనీస ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు వర్షానికి తడుస్తూవేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు నిత్య అన్నదాన సత్రం, ఉచిత క్యూలైన్లలో భక్తులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం వరకు వర్షం కురవడంతో ఛైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశుఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.




వెదురుకుప్పం: మండలంలోని గొడుగుచింత, తిరుమలయ్యపల్లి, పచ్చికాపల్లం, దేవరగుడిపల్లి, మాంబేడు, బొమ్మయ్యపల్లి, వెదురు కుప్పం, కొమరగుంట పంచాయతీలలో ఆదివారం వాన పడింది. దీంతో రైతుల పొలాల్లో ఈదురు గాలులకు మామిడికాయలు నేల రాలి, చేతికొచ్చిన పంట నేలకొరిగిందని ప్రజలు ఆవేదన చెందు తున్నారు. కొన్ని చోట్ల కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. ఇండ్లపై పెట్టిన వాటర్ ట్యాంకులు ఈదురు గాలులకు ధ్వంసం అయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడామైదానానికి రూ.లక్ష వితరణ



ప్రజాశక్తి-పూతలపట్టు: మండలం అనంతపురం పీఎస్ఆర్ వన సంరక్షణ సమితి క్రీడల గ్రౌండ్‌కు తేజస్వి డైరీ అధినేతలు గౌహతి సుబ్బారెడ్డి, నీరద్రాక్ష నాయుడులు ఆదివారం రూ.లక్ష చెక్‌ని గ్రౌండ్ ప్రెసిడెంట్ ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ సుధీర్ కుమార్‌లకు అందించారు. ఈ సందర్భంగా గౌహతి సుబ్బారెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుబ్బారెడ్డి ఆశయాలను నెరవేరుస్తానని ఆమె తెలిపారు. సుబ్బారెడ్డి లేనిలోటు ప్రజలకు సేవ చేయడానికి అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాస్ల మణి, పెనుమూరు వైసిపి మండల అధ్యక్షులు సురేష్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు గోవింద్ రెడ్డి, ప్రొఫెసర్ విద్యాసాగర్, న్యాయవాది రాజేందర్ సుబ్బారెడ్డి, కుమారులు గుణేశ్వర్ రెడ్డి, తేజేశ్వర్ రెడ్డి, నాయకులు పట్టాభి రామ్మూర్తి రెడ్డి, పట్టాభి రెడ్డి వెంకట్ రెడ్డి, సుబ్బారెడ్డి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుష్పపల్లకిలో ఊరేగిన గణనాథుడు



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ పార్వతీపురం వద్ద నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వర స్వామి ఆలయానికి గ్రామస్తులు ఉత్సవ విగ్రహాన్ని నూతనంగా తయారు చేయించారు. ఆదివారం నూతన విగ్రహాన్ని శాస్త్రోక్తంగా హోమాలు, పూజలు, అభిషేకాలు నిర్వహించి శనివారం రాత్రి పురవీధులలో పుష్ప పల్లకిలో ఊరేగించారు. మూడు రోజులపాటు కార్యక్రమాలను నిర్వహించి అన్నదాన వితరణ, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని జడ్పిటిసి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

వైభవంగా గురుసంక్రమణ పూజలు



ప్రజాశక్తి-నగరి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని దక్షిణామూర్తి ఆలయాల్లో ఆదివారం గురుసంక్రమణ పూజలు వైభవంగా జరిగాయి. గురుభగవానుడు మీన రాశి నుంచి మేష రాశికి ప్రవేశించు సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంతేశ్వర ఆలయంలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు మూలస్థాన శ్రీమేతా దక్షిణామూర్తి స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మండపం వద్ద ఉత్సవ దక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేకాలు చేసి అలంకరించారు. మేషం, కుంభం, మకరం, వశ్చికం, కన్య, కర్కాటకం, వషభ రాశుల వారు పరిహారం చేసుకోగా మీనం, ధనస్సు, తులా, సింహం, మిధున రాశులవారు పూజల్లో పాల్గొని గురుభగవానుని దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్రవాడ ఈశ్వరాలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలోనూ ప్రత్యేక అభిషేక అర్చనలు చేసి స్వామిని సుందరంగా అలంకరించగా భక్తులు దర్శించుకొని పరిహార పూజలు చేసుకున్నారు.

రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, వారి పతనం ప్రారంభమైందని పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి చెప్పారు. రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని మండలంలోని చంద్రమాకులపల్లి పంచాయతీ, మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి గ్రామ పర్యటనలో ప్రజలతో మమేకమై వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ప్రజా వ్యతిరేక పాలన తప్పితే ప్రజా రంజక పాలన సాగించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో వైసిపి నేతల దౌర్జన్యాలు, కక్ష సాధింపులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటికి కాలం చెల్లిందని వారి ఆటలు సాగనివ్వమని ప్రజలు వారికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని అభివద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని అన్నారు. జగన్ మోహన్ రెడ్డికి ఒక్క అవకాశం అంటూ రాష్ట్రాన్ని అధోగతి



పాలు చేసిన ఘనత వారికి దక్కుతుందన్నారు. గ్రామంలో నిర్వహించిన ఇదేమి కర్మ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. వారి సమస్యలను కూడా వారు దష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అర్బన్ రూరల్ నాయకులు శ్రీకాంత్, దేశాధి ప్రకాష్, సుహేల్ భాష, సుబ్రమణ్యం రాజు, సద్దాం, మాధవరెడ్డి, నాగరాజా, మోహన్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరి: మున్సిపాలిటీలోని కీలపట్లలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ ఆదివారం పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి కరపత్రాల పంపిణీ చేశారు. వైసీపీ దుర్మార్గమైన పాలన పోవాలంటే 2024లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి వచ్చేలా చేయాలని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ బుకింగ్ సేవలు అందరూ వినియోగించుకోవాలి

జనరల్ మేనేజర్ అశ్విన్ అగర్వాల్

ప్రజాశక్తి-శాంతిపురం: హెచ్‌పీ గ్యాస్ బుకింగ్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జనరల్ మేనేజర్ అశ్విన్ అగర్వాల్ అన్నారు. ఆదివారం శాంతిపురం చుట్టుపక్కల ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా హెచ్‌పీ గ్యాస్ సంస్థకు చెందిన వాల్యూ షాపి వాణిజ్య దుకాణాన్ని ఆదివారం ప్రారంభించారు. హెచ్‌పీ గ్యాస్ డీలర్ సి మంజునాథ్ రెడ్డి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తమ వ్యాల్యూ షాపీ దుకాణంలో గ్లాస్ టాప్ స్టవ్‌లు, స్టెయిన్‌లెస్ స్టీల్ స్టవ్‌లు, ఆప్రాన్స్, లైటర్స్, సురక్ష హౌస్ పైప్స్, ఫైర్ గాడ్స్, ఐదు కేజీల స్టవ్‌లు, ఐదు కేజీల అప్పు సిలిండర్, సిలిండర్లు, కొత్త కనెక్షన్లు,



సర్వీసు లభిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం పరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సేల్స్ మేనేజర్ కిషోర్ సేందిల్ రాజ్, సేల్స్ మేనేజర్ సాయి కీర్తి, వినియోగదారులు పాల్గొన్నారు.

కూటవలవంకలో 'మా నమ్మకం నువ్వే జగన్'

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల సచివాలయ కన్వీనర్ కార్తికేయన్ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని కూటలవంక గ్రామంలో ఆదివారం ఎస్టీ కుటుంబాలను కలిసి వారికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అంటించి, ఇంటింటికీ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, చక్రవర్తి, కోటయ్య, పన్నీర్ సెల్వం, జీవరత్నం, రాజేంద్రన్, సెల్వరాజ్, ఇతర నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు మేఘశ్రీ, రాజేష్ పాల్గొన్నారు.



బీజేపీ అభ్యర్థి ప్రకాష్‌ను కలిసిన కురబ నాయకులు

ప్రజాశక్తి-శాంతిపురం: కర్ణాటక రాష్టం, కోలార్ తాలూకా, బీజేపీ అభ్యర్థి వరత్తూర్ ప్రకాష్‌ను కురబ నాయకులు ఆదివారం కలిసి, తిరుమల ప్రసాదాలు అందించి భారీ మెజారిటీతో గెలవాలని ఆ వెంకటేశ్వర స్వామిని వారు కోరినట్లు తెలిపారు. కురబ రాష్ట్ర నాయకులు ఆరేళ్ళ జయప్ప, స్టేట్ కురబ డైరెక్టర్ దండు రామాంజులు, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సుబ్బు, ఎఎంసి డైరెక్టర్ విద్యాసాగర్, చలపతి, వి.సుబ్రహ్మణ్యం, రూపకుమార్, గణపతి, మురళి, రామ్ మోహన్, అప్పయ్య తదితరులు ప్రకాష్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం ప్రకాష్ స్పందిస్తూ 50వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలుస్తానని దీమా వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు.



రాష్ట్రంలో ఆమ్‌ఆద్మీ విస్తరణ

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మణినాయుడు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆమ్‌ఆద్మీ పార్టీని ఏపిలో విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జి మణినాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని అన్ని జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేసేందుకు ఈనెల 21వ తేది నుండీ పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆమ్‌ఆద్మీ పార్టీపై విశ్వాసముందని ఏ మారుమూల ప్రాంతంలోనైనా పార్టీనికి గుర్తిస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, ఎంపి స్థానాలకు పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఢిల్లీ తరహా పాలన ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. బిజెపి అన్ని రాజకీయ పార్టీలను అనచివేస్తూ అరాచక పాలన సాగిస్తోందన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైనా అడ్డుదార్లలో అనేక రాష్ట్రాల్లో పాలన సాగిస్తున్న బిజెపికి తగిన గుణపాఠం ప్రజలే చెబుతారన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు వెంకటాచలపతి, ఆర్‌కె పట్నం, నరేష్, వెంకటేష్, అనురాధ, రాజేష్‌రాయల్ లు పాల్గొన్నారు.



కళాశాల భూమిని కాపాడుకోవాలి

పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక పివికేయన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సంఘం సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు మాట్లాడుతూ కళాశాల భోదన, అభ్యసన కార్యక్రములలో, పరిపాలనలో పూర్వ విద్యార్థుల పాత్రను గురించి వివరించారు. పూర్వ విద్యార్థుల సంఘం బలోపేతం చేయడానికి పూర్వ విద్యార్థులందరూ పాల్గొనాలని ఉద్భోదించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాల భూమి అన్యాక్రాంతం అవుతోందనికళాశాల భూమిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సభ్యులు సుదర్శనం మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడానికి, కళాశాల భూమిని కాపాడుకోవడానికి సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే హేమలత మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల సంఘం కళాశాల విద్యార్థుల కొరకు వివిధ రకాల శిక్షణ, నియామకాలను చేపట్టవలసిన ఆవశ్యకతను తెలిపారు. సంఘ సభ్యులు రమేష్ రూ.5వేలు చెక్‌ను పూర్వవిద్యార్థుల సంఘానికి అందజేశారు. అనంతరం సభ్యులుపాల్గొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. కార్యక్రమంలో 1969 బ్యాచ్ విద్యార్థుల నుంచి 2021 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానంలో పొంగళ్లు

ప్రజాశక్తి-కోట: కోటలోని శ్రీకోటమ్మ తల్లి దేవస్థానంలో విశ్వనాథపురం అగ్రహారం గ్రామానికి చెందిన యువనాయకులు రాయపు సుబ్రహ్మణ్యం కోటమ్మ తల్లికి ఆదివారం పొంగళ్లు పెట్టారు. టీడీపీ సీనియర్ నాయకులు పనబాక కృష్ణయ్య, అనుచరులు, శ్రీ కోటమ్మతల్లి దేవస్థానం ఆలయధర్మ కర్త నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు నాయకులను సన్మానించారు.



అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-ఓజిలి: ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఇనుగుంట సర్పంచి కొణిదల విజయమ్మ తెలిపారు. సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య సూచనల మేరకు మండల పరిధిలోని ఇనుగుంట గ్రామంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, గహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



పౌష్టికాహారం పంపిణీ



ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని 26 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు అదనపు పౌష్టికాహారాన్ని స్థానిక వైద్య సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి గిరీష రెడ్డి, అభివద్ధి కమిటీ ఛైర్మన్ కష్ణారెడ్డి, కమిటీ మెంబర్లు రమాదేవి, మురళి, వైద్య సిబ్బంది నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి ఎస్సైగా శ్రీనివాసులు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో నూతన ఎస్సైగా టి.శ్రీనివాసులు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చిత్తూరులో రహదారి భద్రత విభాగంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో శాంతిభద్రతలకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

కులమతాలకు భగవద్గీత ఆధారం



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కులమతాలకు భగవద్గీత ఆధారం అని మండల కమిటీ అధ్యక్షులు బాలాజీ అన్నారు. ఆదివారం మండలంలోని ఊటు వంక గ్రామంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదికకి భగవద్గీత ప్రచారం, సాంద్ర సింధు వేదం సారాంశ గ్రంథాల ప్రచారం జరిగింది. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- బంగారు పాళ్యం 2 కమిటీ సభ్యులు ధనుంజయలు, కిరణ్, ఈశ్వర్, హర్ష వర్ధన్, పోషక్, సాయి, ధర్మేష్, ఆనంద, మీనాక్షి, లలిత, రోహిత, సరళదేవి, చిట్టెమ్మ, చాముండి, నాగమ్మ పాల్గొన్నారు.

దేవుడి ప్రసాదం అందజేత



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల వెలుగు, డ్వాక్రా సంఘాల, ఏపీఎం, సీసీలు, సంఘమిత్రాలు కలిసి విహారయాత్రలో భాగంగా కాలినడకన కాణిపాకం, తిరుమల వెళ్లి దేవుళ్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం ఆదివారం బైరెడ్డిపల్లి గ్రామానికి చేరుకొని మండల ఎంపీపీ రెడ్డెప్ప స్వగహానికి వెళ్లి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రసాదాలను ఆయనకు అందించారు.

చంద్రబాబునాయుడి కాన్వాయ్‌పై రాళ్లు వేయడం దారుణం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాన్వాయ్‌పై వైసీపీ నాయకులు రాళ్లతో దాడి చేయడం నీచమైన చర్య అని పుత్తూరు జనసేన పార్టీ నగరి నియోజకవర్గ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నియోజవర్గ జనసేన పార్టీ నా యకుడు గోపి రాయల్ మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రిపై ఇలాంటి దాడులకు దిగడం పద్ధతి కాదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వారిని పార్టీ నుంచి, మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండు చేశారు. జనసేన నాయకులు కష్ణయ్య, శ్రీరామ్, గోవి, మునిరాజా, రమేష్ బాబు తెలిపారు.

అలంకరణలో గురు భగవానుడు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వరాలయంలో గురు గ్రహ ప్రవేశ మహాపూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. గురు గ్రహ భగవానునికి ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్‌బాబు అండ్ బ్రదర్స్, ఆలయ కమిటీ సభ్యులు రమేష్, మున్సిపల్ ఛైర్మన్ హరి, భానోదయ విద్యాసంస్థ నిర్వాహకులు ఇందుమతి ప్రదీప్, భక్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి



ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘంలో పనిచేస్తున్న నాగరాజు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు స్వగ్రామమైన పెంగరుగుంటలో నాగరాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, సీపీఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి అంజి, లక్ష్మయ్య, సంజయ్ తదితరులు సంతాపం తెలిపారు.

బీసీ నాయకుడు చిరంజీవి తల్లి..



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన బీసీ నాయకుడు చిరంజీవి తల్లి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పి.మోహన్ మురళి ఆమె మతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుత్తూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బి.ఎం రవి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చెంజి వరప్రసాద్, మండల టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి బి.మురుగయ్య, మండల ఎస్సీ సెల్ కార్యదర్శి కనకయ్య, బూత్ కమిటీ కన్వీనర్ రాజగోపాల్, మన్నార్ తదితరులు నివాళి అర్పించారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-సోమల: ఆవుల పల్లె పంచాయతీ రాంపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప కుమార్తె శనివారం రాత్రి ఇంటిలో పడుకుందని ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదని ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులు, సమీప ఇండ్లు వెతికినా ఎక్కడా ఆచూకీ తెలియలేదని, తమ కూతురి ఆచూకీ కనిపెట్టి అప్పగించాలని తండ్రి శంకరప్ప పోలీసులను కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జడ్పిటిసిని పరామర్శించిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి




ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: జడ్పిటిసి కేశవులు కలిసిన రాష్ట్ర వైసీపీ కార్యదర్శి మొగసాల క్రిష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి దయానంద గౌడ్, శైలేష్ చక్రవర్తి గుడిపాల మండలంలోని చీలాపల్లిలో ఉన్న సీఎంసీ హాస్పటల్‌కు ఆదివారం వెళ్లి ఆకస్మికంగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ తీసుకొంటున్న బైరెడ్డిపల్లి జడ్పిటిసి మెంబర్ ఆర్.కేశవులు పరామర్శించి ప్రమాదపు కారణాలను తెలుసుకొని, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరుకున్నారు.

ప్రమాదంలో వైసీపీ నాయకుడికి గాయాలు



ప్రజాశక్తి-రొంపిచెర్ల: రోడ్డు ప్రమాదంలో వైసీపీ నాయకునికి గాయాలైన సంఘటన భాకరాపేట ఘాట్ రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు... వైసీపీ రాష్ట్ర ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శి యుగంధర్ రెడ్డి ఆదివారం తన కారులో తిరుపతి నుండి రొంపిచెర్లకు వెళ్తుండగా భాకరాపేట ఘాట్ రోడ్ లో రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు యుగంధర్ రెడ్డి కారును ఢీకొనడంతో కారు బోల్తా పడింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ఆయన్ను స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సుబ్రహ్మణ్యంరెడ్డికి మంత్రి పెద్దిరెడ్డి సన్మానం



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ కామిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డిని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పిచ్చాటూరు మండల పర్యటనలో ఘనంగా సన్మానించారు. పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని పెద్దిరెడ్డి సూచించారు. నాయకులు రాజశేఖర్‌వర్మ సతీమణి సంధ్యను అభినందించారు. కార్యక్రమంలో కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, పూల పళని, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

ప్రజాశక్తి- రేణిగుంట: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రేణిగుంట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యా వికాస వేదిక కన్వీనరు వెంకటరమణ మాట్లాడుతూ ప్రపంచంలోని సంఘ సంస్కర్తలు, నూతన ఆవిష్కరణల చేసిన శాస్త్రవేత్తలు, గొప్ప సాహిత్యకారులు, మానవ వాదులు, తత్వవేత్తలు తయారు కావడానికి ఒక ముఖ్య కారణం పుస్తకాలు ప్రధానమనే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో శుభశ్రీ, కుప్పస్వామి, టీచర్లు ప్రతిమ, అనిత, పుష్పలత, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

